క్లుప్తంగా

ఇద్దరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 22 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.

అయ్యప్పస్వామి జన్మ నక్షత్ర పూజా మహోత్సవం



హఫీజ్‌పేట్ : మదీనాగూడ దీప్తిశ్రీనగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని జగద్రక్షక శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి జన్మ నక్షత్ర (ఉత్తరా ఫల్గుణీ నక్షత్ర) పూజా మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు గణపతి హోమం, 6.15 గంటలకు స్వామి వారికి నలుగు, పంచామృత అభిషేకం, అష్టద్రవ్య అభిషేకము, చందనపు కాపు నిర్వహించగా, మధ్యాహ్నం 12.30 గంటలకు హారతి, తీర్థ ప్రసాదములు, 1 గంటకు శ్రీ వెంకటేశ్వర సేవాసమితి చందానగర్ వారిచే అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 6.00 గంటలకు ప్రసాదరావు గురుస్వామి పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని బండ్లగూడలో పర్యటించారు. బండ్లగూడలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్‌ల శ్మశానవాటికకు సరైన ఫెన్సింగ్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా తన సొంత నిధులతో వంద లారీల మొరాన్ని వేయించి ఫెన్సింగ్ వేయిస్తానని హామీ ఇచ్చారు.

రెండు షాపుల్లో చోరీ

● సీసీ ఫుటేజీలో దొంగతనం దృశ్యాలు నమోదు



సీసీ ఫుటేజీలో దొంగల కదలికలు

పటాన్‌చెరు టౌన్: రెండు షాపుల్లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు నరేశ్, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం చౌరస్తా సమీపంలో తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు దొంగలు ప్లైవుడ్ షాపులో రూ.80 వేల నగదు, పక్కనే ఉన్న సిమెంట్ షాపులో ఉన్న రూ.7 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ దృశ్యాలు సీసీ ఫుటేజీలో నమోదయ్యాయి. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు ఇతర రాష్ట్రాల వారై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఐడియల్ చెరువు కట్టపై దుమ్ము, ధూళి



మూసాపేట: కూకట్‌పల్లి ఐడియల్ చెరువు కట్టపై వందలాది మంది నిత్యం వాకింగ్, జాగింగ్ చేస్తుంటారు. రోడ్డుపై మట్టి పేరుకుపోయి వాహనాలు రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి పైకి లేవటంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఫుట్‌పాత్‌పై మట్టి, దుమ్ము పేరుకుపోయింది. కనీసం వాకింగ్ కూడా చేసుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. మట్టి పేరుకుపోవడంతో పాటు కొద్దిగా మలుపు ఉండటంతో వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కూకట్‌పల్లి: పేదల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు. బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురంలో కేబీకే హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సూర్యప్రకాశరావు, సూర్యారావు, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌రెడ్డి, సంతోష్, విశాల్, భాస్కర్, కృష్ణప్రియ, కల్పన, సాయికుమార్, ఈశ్వర్, అరవింద్ నాయుడు, సాయి, నరేందర్‌రెడ్డి, వినయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ప్రమాదకరంగా..



దీప్తిశ్రీనగర్‌లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

మియాపూర్: కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోడ్ల పక్కన, జనావాసాల నడుమ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులు రోడ్డుకు అడుగుఎత్తులో ఉండడం.. వీటికి కంచె లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరగడంతో బాటు అల్లుకుపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. చెట్లకొమ్మలు, విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలినపుడు నిప్పురవ్వలు వెలువడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మియాపూర్, చందానగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్ల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ఇక కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలకు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధాన రోడ్ల వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని స్థానికులు భయపడుతున్నారు.

- దీప్తిశ్రీనగర్, హుడాకాలనీ, ఓల్డ్ మియాపూర్, బాలాజీనగర్, న్యూ కాలనీ, శాంతినగర్ తదితర కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచె ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు రోడ్డుకు ఒక్క అడుగు ఎత్తులో ఫ్యూజ్ బాక్సులు ఏర్పాటు చేశారు.
- కాలనీలలో ఆడుకునేందుకు వచ్చే పిల్లలకు తెలియక వీటిని ముట్టుకుంటే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముంది.
- ఓల్డ్ మియాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. దీనికి కంచె లేకపోవడంతో పాటు రోడ్డు పక్కనే ఉంది.
- ఓల్డ్ మియాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పక్కన తోపుడుబండ్లపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి.
- ఈ ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో బాటు ఫ్యూజ్‌బాక్సులను ఎత్తులో అమర్చాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..

కాలనీలో జనసమూహాల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, స్థానికుడు

లీకుల తెలంగాణగా మార్చారు

బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్



మసీదుబండలో రఘునాథ్‌యాదవ్‌ను ముందస్తు అరెస్ట్ చేసిన దృశ్యం

రాయదుర్గం: బంగారు తెలంగాణను లీకుల తెలంగాణగా మార్చారని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్‌యాదవ్ విమర్శించారు. మసీదు బండలోని ఆయన నివాసంలో బుధవారం హౌజ్ అరెస్ట్ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజుల క్రితం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో కార్యాలయం ముట్టడిలో బీజేవైఎం రాష్ట్ర నాయకులను అరెస్ట్ చేయడం, లిక్కర్ స్కామ్‌లో ప్రశ్నించిన తీన్మార్ మల్లన్నను, తొలివెలుగు రఘు తదితరులను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. బంగారు తెలంగాణలో పదవ తరగతి పరీక్ష పత్రాలు లీకవడం, మళ్లీ హిందీ పేపర్ లీక్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. పరీక్ష పత్రాల లీకేజీ జవాబు పత్రాల భద్రత నిర్లక్ష్యానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు కుమార్‌సాగర్, అమర్‌నాథ్‌యాదవ్, శ్రీకాంత్‌నాయక్, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిని అవినీతికి అడ్డాగా మార్చారు

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



బీజేపీలో చేరిన వారితో రవికుమార్‌యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అవినీతికి, భూకబ్జాలకు, అక్రమాలకు, వసూళ్లకు అడ్డాగా మార్చారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ విమర్శించారు. కాలనీలు, బస్తీలలో సమస్యలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. మసీదుబండ, వడ్డెరబస్తీ నుండి సహదేవ్ ఆధ్వర్యంలో యువత బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని గెలిపిస్తే సమస్యలన్నీ దూరం చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ 9 ఏళ్లలో ప్రజలను మాయ మాటలతో మభ్యపెడుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, అనిల్‌కుమార్‌యాదవ్, బ్రహ్మం, కొండల్, రాములు, నగేష్, అరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు చోరీ

● ఇద్దరు అరెస్ట్



రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

గచ్చిబౌలి: రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రాయదుర్గం డీఐ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఖాజీ గల్లీ, గోల్కొండకు చెందిన కారు డ్రైవర్ సయ్యద్ సోహెల్(20), యూసుఫ్‌గూడకు చెందిన సయ్యద్ జబ్రెస్ అలియాస్ టబ్రాస్(20) కొంతకాలంగా గోల్కొండ, సైఫాబాద్, రాజేంద్రనగర్, రాయదుర్గం పీఎస్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను చోరీ చేశారని పేర్కొన్నారు. వాహనాల తనిఖీలలో పట్టుబడటంతో పోలీసుల విచారణలో రాయల్ ఎన్‌ఫీల్డ్ చోరీ చేసినట్లు వెల్లడైందన్నారు. నిందితుల నుంచి రూ.4 లక్షల విలువైన నాలుగు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: చెత్త సేకరణకు వెళ్లి ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యయ్యారు. ఈ సంఘటన బుధవారం పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి గత ఏడాది బతుకుదెరువు కోసం వచ్చిన వారు పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ శివారులో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. చెత్త కాగితాలు సేకరిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 3వ తేదీన కాగితాలు సేకరించేందుకు ఇద్దరు బాలికలు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులకు ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్‌తో అపరిచితుడి పరారీ

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఫోన్ మాట్లాడి ఇస్తానని అపరిచితుడు ఫోన్‌తో ఉడాయించి సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. బుధవారం బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్‌కు చెందిన రాంరెడ్డి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లేందుకు ఆటోలో బయలు దేరాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు సాకి చెరువు సమీపంలో ఆగి ఉండగా, ఓ వ్యక్తి రాంరెడ్డి వద్దకు వచ్చి అర్జెంట్‌గా ఓ ఫోన్ కాల్ చేసుకోవాలని బ్రతిమిలాడి ఫోన్ తీసుకున్నాడు. ఫోన్ మాట్లాడిన అనంతరం డయల్ చేసిన నంబర్‌ను డిలిట్ చేసి ఫోన్‌తో పరారయ్యాడు. దీంతో బాధితుడు వెంటనే పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కలుషిత నీరు తాగి గేదెలకు అస్వస్థత

పటాన్‌చెరు టౌన్: కలుషిత నీరు తాగిన 35 బర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్, ఐలాపూర్‌కు చెందిన గేదెల యజమానులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దవాగులో నీరు తాగిన బర్రెలు అస్వస్థతకు గురవడంతో వాటికి వైద్యం చేయిస్తునట్లు చెప్పారు.

దవాఖానాల దగ్గర దుర్గంధం

బాలానగర్: బాలానగర్‌లోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. నాలుగైదు రోజులుగా చెత్తను జీహెచ్‌ఎంసీ కార్మికులు తీయటం లేదని స్థానిక కాలనీవాసులు తెలుపుతున్నారు. ఈఎస్‌ఐ ఆస్పత్రికి వచ్చి వెళ్లే వారికి ఇబ్బందిగా ఉందంటున్నారు. వెంటనే చెత్తను తరలించాలని కోరుతున్నారు.

నేర్చుకోవడమనేది నిరంతర ప్రక్రియ

పటాన్‌చెరు టౌన్: నేర్చుకోవడమనేది నిరంతర ప్రక్రియ అని టీసీఎస్ పూర్వ ఉపాధ్యక్షుడు, ముఖ్య శాస్త్రవేత్త నారాయణ జీపీఎల్ (మండలీక) అన్నారు. రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో టెస్‌ఈక్వినాక్స్ పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల ఐఓటీ హ్యాకథాన్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవస్థాపకత లక్షణాలను ప్రతి విద్యార్థి అలవరచుకోవాలని సూచించారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి మాట్లాడుతూ జంట నగరాల చుట్టుపక్కల నుంచి దాదాపు 15 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, ఐ ట్రిపుల్‌ఈ విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అభివృద్ధిలో అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు పీజేఆర్ కాలనీలో రూ.50లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్లు, ది క్రీక్స్ ప్లానెట్ స్కూల్ సీనియర్ సీడ్స్ సంస్థ సౌజన్యంతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కు, మైదానాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రుల సహాయంతో నియోజకవర్గ పరిధిలోని మూడు మున్సిపాలిటీలకు అధిక నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో రక్షిత మంచి నీరు అందించేందుకు నిర్మిస్తున్న మూడు రిజర్వాయర్ల పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహాగౌడ్, స్థానిక కౌన్సిలర్ మహదేవరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆయావార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ

ప్రభుత్వ విప్ గాంధీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

భాగ్యనగర్‌కాలనీ: పేపర్ల లీకేజీ ముమ్మాటికి బీజేపీ కుట్ర అని, బండి సంజయ్ అరెస్టుతో బాగోతం బయటపడిందని ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి బీజేపీ అగ్రనాయకత్వం చేసిన కుట్రలో భాగమే ఈ లీకేజీల వ్యవహారమన్నారు. పథకం ప్రకారమే పేపర్ బయటకు వచ్చిందని విద్యార్థుల జీవితాలతో బీజేపీ నాయకులు చెలగాటం ఆడుతున్నారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో సంబంధం వున్న వ్యక్తికి బీజేపీ నాయకులతో సన్నిహిత సబంధాలు ఉన్నయనే ఫొటోలు బయటకు వచ్చాయన్నారు. తాజాగా 10వ తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీల వెనక బీజేపీ నాయకులు హస్తం ఉందన్నారు. పేపర్ లీక్ చేసిన వ్యక్తి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు వాట్సాప్‌లో పంపించినట్లు ఆరోపణలు రావటంతో విషయాన్ని బండి సంజయ్ దాచటం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీ వెనుక ఎంతటి వారు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవటం సమంజసం కాదన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్‌లు మాధవరం రోజాదేవి, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనను వ్యాపారంగా మార్చడమే ముఖ్యం



విజేతలతో జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఉస్మానియా వీసీ రవీందర్ , నిర్వాహకులు

జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి

గచ్చిబౌలి: విద్యార్థులు, యువత తమ ఆలోచనలను వ్యాపారాలుగా మార్చడం చాలా ముఖ్యమైన విషయమని జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. కొండాపూర్‌లోని క్లబ్ బొటానికల్‌లో బుధవారం టై గ్రాడ్ బిజినెస్ ఐడియా టోర్నమెంట్ ఏడవ ఎడిషన్ –2023 ఫైనల్స్ నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. ఓయూ వీసీ దండెబోయిన రవీందర్, టై అధ్యక్షుడు రషీదా అడెన్‌వాలా, హుక్‌సెవెన్ వ్యవస్థాపకుడు కె హర్షిత్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ఐడియా టోర్నీ విజేతలు వీరే..

టై గ్రాడ్ బిజినెస్ ఐడియా టోర్నమెంట్ విజేతగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన హీమాక్ హెల్త్‌కేర్ అంకుర సంస్థ నిలిచింది. నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఫీట్ వింగ్స్ నవజాత సంస్థ రన్నరప్‌గా నిలిచింది.



ఆల్విన్‌కాలనీ పీజేఆర్ నగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు



కొండాపూర్ బెటాలియన్‌లో నివాళులర్పించిన కమాండెంట్ మురళీకృష్ణ, ఇతర అధికారులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

గచ్చిబౌలి/రాయదుర్గం: భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రాయదుర్గంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరం బాబూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, బీజేపీ నాయకులు సంజీవ, కృష్ణ ముదిరాజ్, నరేందర్ ముదిరాజ్, హన్మంతునాయక్, నర్సింహరాజు, తిరుపతి, ఇందిరా, దయాకర్, అరుణ్‌గౌడ్, కృష్ణయాదవ్, నరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ 8వ బెటాలియన్‌లో..

కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కమాండెంట్ పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ గంగారామ్, సహాయ కమాండెంట్లు టిఎస్ సింగ్, దేవిదాస్ రాథోడ్, నర్సింహస్వామి, రహమాన్, సత్యనారాయణ, నారాయణదాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మియాపూర్ బొల్లారం చౌరస్తాలో ..

హఫీజ్‌పేట్ : జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, శేరిలింగంపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షులు రఘునాథ్‌రావులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముకేందర్, మహేష్, దీపిక్ చౌహన్, యశ్వంత్, శ్రీను, చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: సమసమాజ స్థాపనకు కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ నేటితరానికి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.

చిట్కుల్‌లో...

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మురళి, వెంకటేశ్, నారాయణ, శ్రీను, రాజు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గాంధీ అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మేడ్చల్– మల్కాజగిరి ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ పీజేఆర్ నగర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ వేడుకల్లో మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్‌డిఓ మల్లయ్య, డీఎస్‌సి డీఓ వినోద్‌కుమార్, ఎంఆర్ఓ గోవర్ధన్, బాలానగర్ ఏసిపి గంగారాం, కార్పొరేటర్‌లు వెంకటేష్ గౌడ్, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



మియాపూర్ బొల్లారం చౌరస్తాలో..



రాయదుర్గంలో మాట్లాడుతున్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు